# మంచుతెర

గుమ్మా నిత్యకళ్యాణమ్మ

"శారదా! కాఫీ!" అన్నాడు ఆనందరావు.

స్టౌవ్ శబ్దంలో అతని మాటలు శారద చెవిని పడలేదు. ఉదయం అయిదు గంటలకు అలారం పెట్టుకుంది అలారం మ్రోగగానే తెలివి వచ్చింది కాని రాత్రి బాగా అలసిపోయిన కారణంగా లేవ బుద్ధి కాలేదు. పెద్దమ్మాయి సుధ మాత్రం లేచి పళ్ళు తోముకుని పుస్తకం తీసుకుంటూ "అమ్మా అయిదు దాటిపోయింది. లే" అంది.

"అయ్యో! అప్పుడే అయిదుంపావు అయిపోతున్నాది." అనుకొని గాబరాగా లేచింది. అది మొదలు మగ్గంలో కండెలా పని. ఎడతెగని పని. ఒత్తుల స్టౌవ్‌మీద సిల్వరు గిన్నెతో నీళ్ళు పెట్టింది. నాలుగు మార్లు కాగపెడితేనే కాని నలుగురికి అందవు. కాన్వెంటులో చదువుతున్న చిన్నవాడు శేఖర్ ఆరున్నరకల్లా వెళ్ళిపోతాడు. రెండు నిముషాలు ఆలశ్యమైనా బస్సు వెళ్ళి పోతుంది. వాడికి టిఫిన్ బాక్సు సర్దాలి. కొంతలో కొంత నయం. సుధ వాడ్ని తయారు చేస్తుంది. ఎనిమిదిన్నరకు సుధా రమణి భోజనాలు చేసి వెళ్తారు. సాయంత్రం నాలుగు దాటితే కాని రారు. వాళ్ళకు టిఫిన్ బాక్సులు సర్దాలి. ఈలోగానే అంట్లు పని, పాచిపని, ఇల్లు వూడవడాలు, పక్కలు ఎత్తి పెట్టడాలు.

అంతేనా? మధ్య మధ్య అతని పనులు పళ్ళు తోముకుందికి బ్రష్, పేస్టు అందించాలి. అడిగినప్పుడు కాఫీ పెట్టి ఇవ్వాలి. స్నానం చేసివస్తే బనియను డ్రాయరు అందివ్వాలి.

మధ్యలో పిల్లలూ ఏవో పురమాయిస్తూ వుంటారు.... "అమ్మా! ఈ స్కర్టు గుండీ తెగిపోయింది. కాస్త కుట్టిపెట్టవూ? అమ్మా! ఈ డ్రెస్ ఇస్త్రీ చెయ్యడం నావల్ల కాదు. ప్లీజ్ చేస్తావా? అమ్మా! నా పెన్ను కనుపించడం లేదు. నేను వద్దంటున్నా వినకుండా నిన్న రాత్రి శేఖర్ తీసాడు. ఎక్కడుందో నీకు తెలుసా?"

శారదకు ఒక వంక దుఃఖం వస్తుంది. వేరొక వంక కోపం వస్తుంది. పిల్లల్ని అయితే కసురుకుంటుంది. అతనికేం చెప్పడం? ఏమిటో పనిలో సహాయం చేయాలనుకోరు. ఏం తానొక్కర్తిదేనా ఈ ఇంటి బాధ్యత. అతనికేం అవసరం లేదా? ఆ మాటంటే విరుచుకు పడతారు.

"అమ్మా! నాన్నగారు కాఫీ అడుగు తున్నారు!" అంది సుధ జడ వేసుకుంటూ.

అంతలో నే ఆనందరావు పేపరుతో సహా వంటింటిలోనికి వచ్చి, "శారదా! కాఫీ కావాలంటు ఇప్పటికి పదిమార్లు అన్నా అన్నాను. వినిపించుకోవేం?" అన్నాడు కోపంగా.

"ఆఁ! పెడుతున్నాను. ఇక్కడ నా చెయ్యి ఖాళీ లేదు. ఒక స్టౌవ్ మీద మీ స్నానానికి నీళ్ళు కాగుతున్నాయి. రెండో దాని మీద కుక్కరు ఎక్కించాను.

ఆనందరావు స్వభావసిద్ధంగా రుస రుస లాడేడు. భార్యను కోపంగా చూసాడు.

"ఆ కుక్కరేదో ఎక్కించే ముందు కాఫీ నీళ్ళు పడేస్తేనేం? ఎంత సేపు? రెండు నిముషాలేగా!" అన్నాడు.

శారద కుక్కరు దింపి కాఫీకి నీళ్ళు పడేస్తూ.... "ఇలా మాటి మాటికి కాఫీకని వండుతున్నవి దించుతూవుంటే పిల్లలకు సమయానికి వంట అవాలా? అందుకే అన్నాను. ఫ్లాస్కులో పోసి వుంచుతాను. కావలసినప్పుడు తాగుతూ వుండండని" అంది.

"అమ్మా! ఎనిమిదింపావు అయింది." అంది రమణి. సుధ ఆ మాట తల్లితో అనాలనుకున్నా తల్లి పడుతున్న అవస్తను చూసి అనలేక పోయింది.

కుక్కరంటే దింపింది కాని అది చల్లారడానికి ఎలా లేదన్నా పది పదిహేను నిముషాలు పడుతుంది. ఆ తరువాత ఆదరాబాదరా తిన్నా బస్సు వెళ్ళిపోతుంది.

"కనీసం స్కూలు పది గంటల నుంచి వున్నా ఎంత బాగుండును. అమ్మకు కొంత రిలీఫ్ దొరుకుతుంది. స్కూలు మేనేజ్‌మెంటువారు గృహిణుల బాధలనెందుకు అర్థం చేసుకోరు? కనీసం ఈ పేరెంట్సు అయినా వేళలు మార్చమని ఎందుకు అర్థించరు?" అనుకుంది సుధ.

"చూస్తున్నావా రమణి! నేను గూడా పిండి అవుతున్నాను. ఇదిగో కుక్కరు చల్లారిపోవచ్చింది. ఈలోగా మీ టిఫిన్ బాక్సు లివ్వండి. సర్దేస్తాను" అంది.

"లాభం లేదమ్మా! తింటూ కూర్చోడానికి వేళలేదు. ఆ టిఫిన్ బాక్సు ఇచ్చేయి!" అంది సుధ.

"ఏమిటే! భోజనం చెయ్యకుండా వెళ్ళిపోతావా? మరి ఈ వంట ఎవరికోసం వండినట్టు. హైరానా పడడమే మిగిలింది" శారదకు దుఃఖం వచ్చింది.

"అమ్మా! రమణి అంతసేపు ఆకలితో వుండలేదు. అది ఈ రోజు స్కూలి కెళ్ళదు" అంది సుధ. సుధ టిఫిన్ బాక్సు తీసుకొని వెళ్ళిపోతూ వుంటే తనమీద తనకే కోపం వచ్చింది. ఛీ! పిల్లలకు వేళ కింత తిండైనా పెట్టలేక పోయింది. తెల్లవారకుండా లేచి ఏం ప్రయోజనం? మధ్యలో ఆ కాఫీల అంతరాయం లేకపోతే ఇలా జరిగేదా?

"మినుంచే ఈ రోజు సుధ భోజనం చెయ్యకుండా స్కూలికి వెళ్ళి పోయింది. రమణి అసలు వెళ్ళనే లేదు.

"ఏం దాన్ని నేను భోజనం చెయ్యవద్దన్నానా? రమణిని స్కూలుకి వెళ్ళ వద్దన్నానా?" భార్యను ప్రశ్నించాడు ఆనందరావు పేపరు చూస్తూనే.

"సమయానికి వంట కాకపోతే వాళ్ళేం చేస్తారు?"

"బాగుంది. వంట వండింది నువ్వా, నేనా? ఎవరైనా వింటే నవ్వి పోతారు. నేనే వండుతున్నాననుకుంటారు. నీ వంట కాకపోతే మధ్యను నాదా తప్పు?"

"అయ్యో! రాత! ఈ మనిషికి అర్థం కాదా? లేక అర్థం చేసుకోవాలని ప్రయత్నించరా? తనెన్నిమార్లు చెప్పింది. పిల్లలను స్కూళ్ళకు పంపించే వరకు తన పనుల కంతరాయం కలిపించ వద్దని. అయినా వింటున్నారా? వండుతూ వడ్డిస్తూ మధ్యలో రెండు మార్లు కాఫీలు పెట్టడం వలననే కదా పదిహేను నిముషా లాలశ్యం అయింది. వాళ్ళ పుస్తకాలు, పెన్నులు వెతికి పెట్టడమో బట్టలు ఇస్త్రీ చెయ్యడమో చేస్తే తాను స్మిమితంగా వండేది కాదా? కనీసం అది ఇయ్యి ఇది ఇయ్యి అని తాను పురమాయించక పోయినా సరిపోతుందిగా? ఆ మాత్రం బాధ్యత ఆయనకు లేదా?"

"ఔను లెండి! మీతో వాదించి నెగ్గుకు రాలేను. కాలికి వేస్తే మెడకు, మెడకు వేస్తే కాలికి. కనీసం మీ కాఫీ ఫ్లాస్కులో పోసి వుంచుతాను. కావలసినప్పుడు ఆరా ఆరా త్రాగుతూ వుండండి అన్నా మీరు అంగీకరించరు. ఇలా అయితే ఆ పిల్లల్ని వేళకు స్కూలుకి పంపించడం నా చాతకాదు."

"చాల్లే శారదా! నీ అశ్రద్ధకు నేను కారణమా? కనీసం నన్ను ఉదయం పూట తీరిగ్గా పేపరైనా చదువు కోనివ్వవా? నీకైతే పది గంటల నుంచి తీరికే. నీకేం కష్టం కలిగించే పనులు చెప్పున్నానని నన్ను సాధిస్తున్నావు. ఇంత సంపాదిస్తున్నాను. రెండు మార్లు కాఫీ త్రాగడం నీకు కష్టంగా వుందా?"

"అదిగో, ఏమైనా అంటే నేను పగలల్లా తీరిగ్గా కూర్చుంటాను అంటారు. రెండు రోజులు ఇంటిలో వుండి చూడండి. నేనెంత తీరిగ్గా వున్నానో తెలుస్తుంది. ఏమైనా అంటే ఇంత గడిస్తున్నాను అంటారు. అయితే నేనూ ఏదైనా వుద్యోగం చేస్తాను – మరి నాకు పగలు తీరికేగా?" అంది పౌరుషంగా.

"శారదా! చదువుకున్నానన్న గర్వం నీకుంది. అందుకే మాటి మాటికి నేనూ వుద్యోగం చేస్తాను అంటావు."

శారదకు దుఃఖం వచ్చింది.

ఇదా ఈ పెద్ద మనిషి తనను అర్థం చేసుకున్నది? ఎంత విపరీతంగా ఆలోచిస్తారు?

"శారదా! మరో గంట ముందు లేవాలని తెలియదా?"

"ఔను! రేపటినుంచి నాలుగు గంటలకే లేవాలి. ఛీ! ఆడపుట్టుకే ఇంత. తను బానిసలా పని చేయాలి. ఆయన కోసం పిల్లల్ని కనాలి. వాళ్ళను సాకాలి. వాళ్ళకు వేళకింత వండి పెట్టాలి. వాళ్ళ చదువుల విషయం చూడాలి. ఈ ఇంటిలో ఒక పనిమనిషి కున్న గౌరవం తనకు లేదు. తను సంపాదిస్తున్నా-రనేగా అతని గర్వం. అందుకే కాలు మీద కాలు వేసుకు కూర్చుంటారు. తానూ అతనంతా చదివింది. పైగా బి.ఎడ్. పాసైంది. తను ప్రయత్నిస్తే ఎక్కడైనా జాబ్ దొరక్కపోదు. అంతే చెయ్యాలి."

శారదలో అంతర్యుద్ధం మొదలైంది.

* * * *

ఆనందరావుకి ఆఫీసులో పనిమీద మనస్సు లగ్నం కాలేదు.

శారద తానూ ఉద్యోగంలో చేరాలని బెదిరిస్తు-న్నాది. దీని పర్యవసానం ఎలా గుంటుంది? రోజూ ఇంటిలో తగువులే. శారదకు తన పట్ల నిర్లక్ష్యం ఎక్కువౌతున్నది.

తనామెను ఏం బాధలు పెడుతున్నాడు?

ఆమె ఆలోచనాసరళిలో మార్పు రావడానికి కారణం అతని ఊహకు అందనిది కాదు. ఈ మధ్య అపర్ణ చేసే బోధలు ఆమె చెవి నెక్కుతున్నాయి. తనూ ఉద్యోగం చేసి సంపాదించగలననే దర్పం. అందుకే తనంటే చిన్న చూపు.

ఆనందరావు తను పొరపాటు చేసా ననుకున్నాడు. తల్లి మాటలు పెడ చెవిని పెట్టాడు. "బాబూ! శారద బాగా చదువుకున్న దంటున్నావు. అలాంటి పిల్ల కుదురుగా ఒర్మిగా నీ చెప్పు చేతల్లో వుంటుందను-కోను. నా మాట విని ఇంకో అమ్మాయిని చేసుకో. ఉత్తరం ముక్క రాయగలిగిన అక్షరజ్ఞానం వుంటే చాలు" అంది.... తను శారద విషయం చెప్తే. అయినా శారద అందం చందం చూసి తను మోసపోయాడు. విద్యాగంధం వున్న స్త్రీలకు అహంకారం వుంటుందని శారద నిరూపించింది.

లంచ్ టైమ్‌లో శెలవు తీసుకొని ఇంటికి వచ్చాడు.

* * * *

"పూర్ శారదా! ఇంత చదువూ చదివి నీవు వంటింటి కుందేలు వయ్యావు. నిన్ను చూస్తూ వుంటే నాకు జాలి వేస్తున్నది" అంది అపర్ణ.

"అపర్ణా! ఈ మాట నీవనడం ఇది నూటయాభై ఆరో మారు" అంది.

"నేను ఇన్నిమార్లు నీ బాగుకోరి చెప్పినా నీవు నా మాటలు పెడచెవిని పెడుతున్నావు. మహిళల హక్కులను పరిరక్షించడమే ధ్యేయంగా పెట్టుకున్న నేను నీవిలా కుమిలి పోవడం సహించ లేను."

"నేను కుమిలి పోతున్నానా?" శారద నవ్వింది.

"ఆ నవ్వు వెనక నీ బాధను దాచుకోవాలని ప్రయత్నించకు. నాకంతా తెలుసు. రమణి చెప్పింది."

"ఏమిటి? రమణి చెప్పిందా? ఏమని?"

"కంగారు పడకు. పతియే ప్రత్యక్ష దైవం అని భావించే భారతీయ నారివైన నీ కూతురు తన తల్లి గురించి చెడుగా చెప్తుందా? పాపం శమించుగాక. రమణి తన నోటితో ఏమి చెప్ప లేదు. నేనే అర్థం చేసుకున్నాను. సమయానికి వంట కానందున ఆ పిల్ల స్కూలికి వెళ్ళ లేదు."

"ఔను! అంత మాత్రాన ఒరిగి పోయింది ఏమిటి? ఆ విషయం ఆధారంగా నేను కుమిలి పోతున్నానని భావిస్తున్నావా? బేషుగ్గా వుంది. నేను భారతీయ నారినే. నీవు కావా?"

"శారదా! నిన్ను నీవు మభ్యపెట్టుకోకు. నాకంతా తెలుసు. పిల్లల్ని కనడం, వారిని పోషించడం, భర్త అడుగులకు మడుగు లొత్తడం, అతనిచేత చీవాట్లు తినడం, ఇవేనా స్త్రీల అధికారం?

గృహ నిర్వహణములో స్త్రీ పురుషుల బాధ్యతలు సరి సమానం. ఒకరు అధికులు వేరొకరు అధములు కారు. శారదా రోజులు మారాయి. అంటే కాల చక్రం గిర్రున తిరిగింది. మనం ఒక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నాం అందులో కూడా స్త్రీలకు పురుషులతో సమానంగా హక్కులు, ఓటింగు



హక్కులూ వున్నాయి. అంటే స్త్రీ పరిపూర్ణమైన స్వాతంత్ర్యం ఉంది. ఆపైన విద్యలో, వినోదాలలో, ప్రెస్సులలో, ప్లాట్‌ఫారాల మీద, నాటకాలలో, సినీమాలలో, రాజకీయాల్లో, విప్లవాలలో, విమానాలలో అన్ని రంగాలలోనూ స్త్రీ లున్నారు. స్టీలూ, సిమ్మెంటు, పంచదార వంటి ప్రాణంలేని వస్తువులనే నియంత్రణలో పెట్టలేని పురుషులూ, రాజకీయ నాయకులూ ఆదిశక్తి స్వరూపిణి వంటి స్త్రీని కంట్రోల్ చెయ్యాలను కోవడం ఆమె స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఉక్కు చట్టాలలో బిగించాలను కోవడం కేవలం అవివేకం. తమ ఆధిక్యతను నిలుపుకోవడానికి పురుషులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కట్టుబాట్లని ఏర్పాటు చేసారు. "స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః, నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అన్నారు. అయినా స్త్రీలు ముందడుగు వేస్తున్నారు.

శారదా నా మాట విను. స్త్రీ తన స్వాతంత్ర్యం నిలుపుకోవడానికి భర్తతో తెగతెంపులు చేసుకోవల-సిన అవసరం లేదు. తన హక్కు లేమిటో తెలుసుకోవాలి. వాటి కోసం పోరాడాలి. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లభించే వరకు ఆమె పురుషుడి కాలి కింద చెప్పులా పడి వుండాలి. నా మాట విని నీవు ఆర్థికంగా స్వతంత్రురాలివికా." అంది.

"అపర్ణా! శబాష్! ఈ రోజు సాయంత్రం మహిళా మండలిలో స్త్రీల హక్కుల విషయం మీద నీ ప్రసంగం వుందా? ఇవి రిహార్సలా? అపర్ణా! రమణి తాను ఏ కారణంగా స్కూలు కెళ్ళలేదో నీతో చెప్తే నీవు ఇంత ముందుకి ఆలోచించావా? అసలు నన్నడుగుతే ఎటిండెన్సు కోసం కాక స్కూలికి వెళ్ళవలసిన అవసరం వుందంటావా? పుస్తకం చదివి ఇంటి దగ్గర జవాబులు రాసి తీసుకురమ్మం టారు. కనీసం చిన్నతరగతులలోనైనా నోట్సులు రాయిస్తున్నారా? తల్లిదండ్రులు చదువుకోని వారైతే ఇక స్కూలు పిల్లలేం నెగ్గుకు వస్తారు?"

"గైడ్సు వున్నాయి. లేకపోతే ట్యూషను చెప్పించు-కోమంటారు శారదా! ఇప్పుడంతా మోడరన్ విద్యావిధానం. అయినా మనం రామాయణం వదిలి పిడకల వేటలో పడ్డాం."

"ఈ భాగవతం రోజూ వున్నదే. కూర్చో కాఫీ తెస్తాను. రాగానే పెద్ద వుపన్యాసం ఇచ్చావు"

"శారదా!" ఇప్పుడు కాఫీ వద్దు. నీవిలా వంటింటికి దాసోహం కావడం నాకు నచ్చలేదు. ఇంగ్లీష్ మీడియంలో బి. ఎడ్ పాసయ్యావు. ఏ కాన్వెంటులో-నైనా ఉద్యోగం చేస్తే ఏడెనిమిది వందలు దొరుకుతాయి. ఇటు ఆర్థిక స్వాతంత్ర్యం వుంటుంది. అటు నీ చదువుకి సార్థక్యం వుంటుంది. దేశానికి ముఖ్యంగా స్త్రీ లోకానికి మేలు చేసినదానివౌతావు." అంది.

అపర్ణ ఇలా సలహాలిస్తూనే వుంటుంది. దినపత్రిక ఆఫీసులో పని చేస్తున్నాది. మహిళల సమస్యల మీద వ్యాసాలు రాస్తుంది. స్త్రీకి ఎక్కడ అనాదరణ కలిగినా ఆమె గర్జిస్తుంది. వారిలో జాగృతి తేవాలని నిరంతరం కృషి చేస్తుంది.

శారద ఆలోచించసాగింది. ఆమె అన్నదానిలో అసత్యం అవాస్తవికత ఏమీలేదు. తను చదువుకునే రోజుల్లో ఇలాంటి భావాలనే కడుపులో నింపుకుంది. మొదటి నుంచి టీచరు ప్రొఫెషనంటే విపరీతమైన అభిమానం వుండేది. మిషనరీ స్కూల్లో చదివింది. ఆ టీచర్సు పెళ్ళిళ్ళు మాని వారి జీవితాలను విద్యా దానానికే అర్పితం చేసారు. పిల్లలను ఎంత ప్రేమగా చూసేవారు. వారిలోనే దైవం వున్నాడని వారిని తీర్చిదిద్దవలసినందుకే తమను పుట్టించేడని అనేవారు.

అందుకే తల్లిదండ్రులను ప్రతిఘటించి బి. ఎడ్. లో చేరింది. పెళ్ళి మానితనూ ఆ టీచర్సు అడుగుజాడల్లో నడవాలనుకుంది. అయితే పరిస్థితులు మరో విధంగా పరిభ్రమించాయి. తల్లిదండ్రులు ఆమెతో ఏకీభవించలేదు. ఇతిహాసాలు, పురాణాలు, స్మృతుల నుంచి గాథలు ఏరి ఆమెకు చెప్పి, ఆధునిక యుగంలోని మహత్తర మహిళల సాహసగాథలు వర్ణించి, పెళ్ళి చేసుకోవడం సంసారం చేయడం లోకధర్మమంటూ వివరించి ఆమెను వివసురాలిని చేసారు.

ఇప్పుడేం చెయ్యడం??

???

"శారదా! నీ బాధను నేనర్థం చేసుకోగలను ఒక వంక ఈ సంసారం వేరొక వుద్యోగం ఈ రెండు నావల్లో ప్రయాణం సాధ్యమా అని అనుకుంటు-న్నావు కదూ? డోంట్ వర్రీ. ఈ వుద్యోగం ఆర్థిక స్వాతంత్ర్యం కోసం. సంసార బంధాన్ని తెంపుకోమనను. అంత నీచురాలిని కాను ఇకపోతే నీ పిల్లలు పసివాళ్ళు కారు. వారి పనులు వారు చేసుకొనే జ్ఞానం వుంది. నీవు వుద్యోగంలో చేరితే వారు ఆత్మనిర్భరులౌతారు. ప్రతీ పనికి నీ మీద ఆధారపడరు. ఇక నీ భర్త సరేసరి. మొదట్లో విసుగుకున్నా నీవు తనతో సమానంగా సంపా-దిస్తున్న కారణంగా నీ మీద తన అథారిటీ చలాయించలేడు. అతని మనస్తత్వంలో త్వరలోనే మార్పు వస్తుంది. ఈ మార్పు సుఖజీవితానికి నాంది. ఒక వంట మనిషిని, అంట్ల మనిషిని కుదుర్చుకో. అప్పుడు నువ్వు వంటింటికే పరిమితం కానక్కరలేదు" అంది అపర్ణ.

"..........."

"నీ భర్తకు బాధ్యతలు అప్పచెప్పాలంటే ఇదే మంచి మార్గం."

శారద మౌనం వహించింది.

"శారదా! స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేకుంటే పురుషులామెను కాలి కింద చెప్పులా చూస్తారు. నీవు చదువుకున్న కాన్వెంటు స్కూల్లో టీచరు పోస్టు ఖాళీగా వుంది. ఆ ప్రిన్సిపాల్‌కి నీవంటే ఎనలేని అభిమానం. నీవు అడగాలే కాని ఆమె నీ మాట త్రోసి పుచ్చదు ట్రై చెయ్యి" అంది.

*   *   *

బయట నిలుచున్న ఆనందరావు వారి సంభాషణ వింటున్నాడు. లంచ్ టైమ్‌లో ఇంటికి వచ్చిన అతను అపర్ణ మాటలు విని బయటే వుండిపోయాడు.

శారద ఆర్థిక స్వాతంత్ర్యం కావాలనుకుంటున్నాది. శారద కేం తక్కువైందని? చదువుకన్న ఆడవాళ్ళు ఎంతకైనా తెగిస్తారు. విదేశీ వ్యామోహంలో వారిని అనుకరించుకోవాలని తమ జీవితాలలో చిచ్చు రేపుకుంటున్నారు. ఇలాంటి స్త్రీ సాన్నిధ్యాన్నితాను ఆశించాడు? రేపు ఆమె వుద్యోగస్తురాలైతే ఆమె భూమ్మీద నడుస్తుందా?

లేదు. ఆమె ఉద్యోగం చేయడం తాను సహించలేడు. స్త్రీలు వుద్యోగాలకు అనర్హులని తన అభిప్రాయం కాదు. అయితే అవసరం వున్న వారే వుద్యోగాలకు ప్రయత్నించాలి. కాని అపర్ణ చెప్పినట్లు ఆర్థిక స్వాతంత్ర్యం కోసం భర్తలను ధిక్కరించడం కోసం కాదు. నారి హృదయం కోమలం అంటారు. పాషాణంలోనైనా కోమలత్వం వుంటుంది. ఈ కాలం స్త్రీలలో కాఠిన్యమే కాని ఆర్ద్రత లేదు.

అతనిలో అసహనం అధికమైంది.

తనూ ఏదో నిర్ణయం తీసుకోవాలి.

ఏమిటి?

??

*   *   *

"సారీ! అపర్ణా! ఈ పరిస్థితుల్లో ఉద్యోగం చేయడం నావలన కాదు. నా భర్తను నీవు చాలా తప్పుగా అంచనా వేసుకున్నావు. అతనికి ముక్కు మీదకోపం అంటే నేను ఒప్పుకుంటాను. ఆ కోపం, అపర్ణా! గడ్డి మంటలా చప్పున చల్లారి పోతుంది. ఈ పిల్లలను పనివాళ్లకు అప్పగించలేను. తల్లివుండి కూడా వాళ్ళను తల్లి ప్రేమకు దూరం చేయలేను. నా స్వంత పిల్లలకు ప్రేమాభిమానాలు పంచలేని నేను పరాయి పిల్లలను ఎలా ఆదరంగా చూడగలను? ఇక ఆర్థిక స్వాతంత్ర్యం అంటావా? ఇప్పుడు నాకేం తక్కువైంది? తను జీతం తెచ్చి ఎవరికిస్తున్నారు? ఈ ఇంటి ఖర్చులు పెడుతున్న దెవరు? మరి నాకు ఆర్థిక స్వాతంత్ర్యం లేదని ఎందుకనుకోవాలి.

నా పిల్లలకు నాలుగు అక్షరం ముక్కలు అంటాలంటే నేను చాలా పరిశ్రమించాలి. వాళ్ళ భవిష్యత్తుని తీర్చిదిద్ద వలసిన బాధ్యత నా చేతుల్లో వుంది. ఆయనకు చెప్పే ఓపికా లేదు టైమూలేదు. బయట పది మందికి విద్యాదానం చేసే కన్నా నా పిల్లలకే ఆదానం చెయ్యడం నా బాధ్యత.

స్నేహితురాలి వని నా కష్టం సుఖం నీకు చెప్పుకుంటాను. అయితే నా స్వర్గాన్ని నరకం చేసుకోవాలని అనుకోవడం లేదు. ఈ ఇల్లేనాకు స్వర్గం. ఈ ఇల్లే నాకు నందనవనం." అంది శారద దృఢంగా. □